క్లుప్తంగా

వీధిదీపాలకు స్విచ్‌ల ఏర్పాటు



బాకారంలో వీధిదీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నదీమ్ నగర్, బాకారం గ్రామాల్లో వీధి దీపాలకు విద్యుత్ సిబ్బంది ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో వీధి లైట్లు నిరంతరం వెలుగుతుండడంతో విద్యుత్ వృథా అవుతోందని.. ఈ సమస్యపై పట్టపగలు వెలుగులు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం మండల అభివృద్ధి అధికారి సంధ్య సంబంధిత అధికారులతో మాట్లాడి ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గంప జాతర



గరుడవాహన సేవలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గంప జాతర ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి సోమవారం జరుపుకునే ఈ ఉత్సవంలో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, వాహన సేవలు కొనసాగాయి. భక్తులు ఉదయం నుంచే భారీగా తరలివచ్చి పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో గరుడ వాహన సేవను ఊరేగించారు. ఆలయ అర్చకుడు వామానాచార్యులు, దేవదాయశాఖ మేనేజర్ నరేందర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వీధిలైట్లు అందజేత

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లిలో వీధిలైట్లు లేక రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై స్పందించిన మాజీ ఉపసర్పంచ్ అనుమగళ్ల రమేశ్ సోమవారం పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్‌కు వీధిలైట్లు అందించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, నాయకులు చెన్నయ్య, తిరుమలయ్య, నరేందర్, రమేశ్, వెంకటయ్య, శివ, యాదయ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని వినతి



వాగు దాటుతున్న విద్యార్థులు

కేశంపేట: మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామ శివారులో ఉన్న వాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్యకు డీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో పాటిగడ్డ వాగు నిండుగా ప్రవహించినప్పుడు గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు వ్యవసాయ పొలాలకు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని దుస్థితి ఏర్పడుతోందన్నారు. అధికారులు, నాయకులు స్పందించి వాగుపై బిడ్జిని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రవి, శివ, శ్రీకాంత్, కృష్ణ, నర్సింహ, శ్రీకాంత్, కృష్ణ, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నందిగామ: రాష్ట్రంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఆస్తిపాస్తులు లేకుండా కేవలం కులవృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నా నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడ్డ నాయీ బ్రాహ్మణులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.1000 కోట్ల నిధులను కేటాయించి, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నామినేటెడ్ పోస్టుల భర్తీలో సైతం నాయీబ్రాహ్మణులకు అవకాశాలు కల్పించాలని కోరారు.

సంత.. సమస్యలే అంతా

రోడ్డుపక్కనే కూరగాయలు, పండ్ల విక్రయాలు

- కనీస సౌకర్యాలు కరువు
- వ్యాపారులు, వినియోగదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



కొత్తూరులో రోడ్డు పక్కన సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కొత్తూరు: హైదరాబాద్ మహా నగరానికి అతి చేరువలో ఉన్న కొత్తూరు పట్టణం ప్రస్తుతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే పట్టణంతో పాటు సమీప గ్రామాల్లో పలు బహుళజాతి పరిశ్రమలు, వందల సంఖ్యలో రియల్ వెంచర్లు ఏర్పాటయ్యాయి. పట్టణంలో నివసించే జనాభా సైతం వేలల్లో ఉన్నారు. జనాభాకు తగ్గట్లుగా పట్టణంలో మార్కెట్లు లేక రోడ్ల పక్కనే కూరగాయలు, మాంసహారం, పండ్ల దుకాణాలు నిర్వహిస్తున్నారు. అన్నీ దుకాణాలను ఒకేచోట నిర్వహించేందుకు వీలుగా పట్టణంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో అసౌకర్యాల మధ్యన సంత జరుగుతోంది.

సౌకర్యాలు లేక.. ఇబ్బందులు తప్పక

పట్టణంలో జరిగే సంతకు ప్రతీ ఆదివారం స్థానికులతో పాటు మండలంలోని ఆయా గ్రామాల నుంచి వేల సంఖ్యలో కొనుగోళ్ల కోసం కార్మికులు, ప్రజలు వస్తుంటారు. సంతలో వారికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి టాయిలెట్స్ అందుబాటులో లేవు. దీంతో ప్రజలతో పాటు చిరువ్యాపారుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ముఖ్యంగా సంత జరిగే రోడ్లలో చోరీల నియంత్రణకు గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ అవి ప్రస్తుతం పని చేయడం లేదు.

ఇబ్బందులు ఇలా..

- కొత్తూరు పట్టణంలో ప్రతీ ఆదివారం సంత జరుగుతుంది. పట్టణంతో పాటు పారిశ్రామిక వాడ నుంచి ప్రజలు నిత్యావసరాల కోసం సంతకు వస్తుంటారు.
- స్థానికంగా మార్కెట్ అందుబాటులో లేని కారణంగా కూరగాయలు, మాంసహారంతో పాటు ఇతర దుకాణాలను రోడ్డు పక్కనే నిర్వహిస్తున్నారు.
- ముఖ్యంగా స్లాటర్ హౌజ్ లేని కారణంగా మాంసహార చికెన్, చేపల వ్యర్థాలను వ్యాపారులు సమీపంలోని రోడ్ల పక్కన పారబోస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.
- అసలే పట్టణంలో ఇరుకు రోడ్లు.. ఆపై దుకాణాలు పెట్టడంతో ట్రాఫిక్ జామ్, ఇతర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- కొత్తూరు–జేపీదర్గా, కొత్తూరు–పెంజర్ల రోడ్డులో దుకాణాల కారణంగా ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటుంది.
- స్థానికంగా పార్కింగ్ స్థలం లేని కారణంగా మార్కెట్‌కు వచ్చినవారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది.

మార్కెట్ పూర్తయితేనే సమస్య పరిష్కారం



పట్టణంలో నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితేనే చిరు వ్యాపారుల ఇబ్బందులు, సమస్యలు పరిష్కారం అవుతాయి. ప్రస్తుతం రోడ్ల పక్కన విక్రయాలు చేపడుతున్న కూరగాయలు, పండ్ల వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలి. మార్కెట్ నిర్మాణం ప్రస్తుతం పలు కారణాలతో నిలిచిపోయింది. పనులు పూర్తయితే చిరు వ్యాపారులకు అన్ని సౌకర్యాలు ఉంటాయి.

–బాలాజీ, మున్సిపల్ కమిషనర్

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



పూజల్లో మాజీ ఎమ్మెల్యేలు నర్సింలు, అంజయ్యయాదవ్, భక్తులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో మహాకుంభ ప్రోక్షణ, పవిత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి 25 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నిత్యసేవాకాలం, నిత్య హవణం, శ్రీయాగం, విశేష హోమం, నిత్య పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు బండారి రమేశ్, వంకాయల నారాయణరెడ్డి, కిషోర్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అలుగు వద్ద ప్రత్యేక పూజలు



పూజలు చేసేందుకు బయలుదేరిన గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న పెద్దచెరువు ఇటీవల కురుస్తున్న వర్షాలకు అలుగు పారుతుండడంతో సోమవారం గ్రామస్తులు చెరువు కట్టపైన ఉన్న మైసమ్మ, గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. వ్యవసాయానికి నీటి ఇబ్బందులు ఉండవని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పల్లె ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీగా చెరువు కట్టవద్దకు చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, శివకుమార్, సత్యానారయణ, గోవర్ధన్‌రెడ్డి, శ్యాంకుమార్, లింగం, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు



కొందుర్గులో బోనాల ఊరేగింపు



కేశంపేట: బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు

కొందుర్గు: మండల కేంద్రంలో సోమవారం మైసమ్మ బోనాల ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు వాహనాలు, ట్రాక్టర్లతో అమ్మవారి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి.

కేశంపేట: మండల పరిధిలోని లింగంధన, నిర్దవెల్లి, కేశంపేట, తొమ్మిదిరేకుల, లేమామిడి, కొనాయపల్లి, అల్వాల గ్రామాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు బోనాల ఊరేగింపుతో ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కేశంపేట గ్రామంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సుదర్శన్‌గుప్తా, నాగిళ్ల వెంకటేశ్, ప్రవీణ్‌రెడ్డి, మురళీ, నక్క గోపాల్, అమరేశ్, శేఖర్‌యాదవ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: నిర్దవెల్లిలో బోనాల ఉత్సవాల్లో మహిళలు

కంచె వేయరు.. ప్రమాదం తప్పించరు..

రోడ్లు, ఇళ్ల పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు ప్రజలు, మూగజీవాల పాలిట మృత్యు పాశాలుగా మారుతున్నాయి. అయినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు జనావాసాల్లో ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి కంచెలు వేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కంచెలు వేయడానికి శాఖ తరఫున నిధులు మంజూరు కావని సమాధానం చెబుతూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో తరచూ వాటి వద్ద ప్రమాదాలు జరిగి ప్రజలు, మూగజీవాలు బలవుతున్నాయి.

– కొత్తూరు



పెంజర్ల రోడ్డులో ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



సభ్యత్వ నమోదులో పాల్గొన్న విద్యార్థులు

షాద్‌నగర్: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. సోమవారం పట్టణంలోని విజేత జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థుల పక్షాన ఉండి పోరాటం చేస్తోందన్నారు. అందరికీ సమానమైన విద్యనందించాలని, విద్యార్థుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతం తాము పోరాటం చేస్తున్నామని వివరించారు. ఎస్‌ఎఫ్‌ఐలో సభ్యత్వం తీసుకోవడం అంటే.. ఒక ఉద్యమంలో భాగమై, సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషి చేయమేనన్నారు. దీంతో సమాజంలో నెలకొన్న సమస్యలు, కుల వివక్ష, ఆర్థిక అసమానతలు, మతతత్వం వంటి సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకుంటారన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు ఆదిల్, సభ్యులు ప్రవీణ్, చరణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు పంపిణీ చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

షాద్‌నగర్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం పలువురు నిరుపేద మహిళలు పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు అసంపూర్తిగా నిర్మించి వదిలేసిందన్నారు. డబుల్ ఇళ్లలో సౌకర్యాల కల్పనకు ఇటీవల నిధులు మంజూరు చేయిస్తే బకాయిల కింద జమైనట్లు తెలిపారు. దీంతో ఇళ్ల పంపిణీలో ఆలస్యం జరిగిందన్నారు. విద్యుత్, మంచి నీటి సౌకర్యం కల్పించాల్సి ఉందని, ఆ పనులు పూర్తవగానే లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

సీఐ భూపాల్‌శ్రీధర్



మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: రాబోయే గణేశ్ ఉత్సవాలను అంతా కలిసి మెలసి శాంతియుతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ భూపాల్‌శ్రీధర్ సూచించారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో సోమవారం సాయంత్రం పోలీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాలను జరుపుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు వివరించారు. మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖకు మండపాల సమాచారం ఉంటే ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే అక్కడికి వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. కావాల్సిన బందోబస్త్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరికీ ఇబ్బందులు కలిగించకుండా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. డీజేల వాడకం పూర్తిగా నిషేధమన్నారు. ముందుగానే మండపాలకు సంబంధించిన అనుమతి కోరుతూ సమాచారం పోలీస్‌లకు అందించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ఎస్‌ఐలు సంతోష్‌రెడ్డి, తేజశ్రీ, శిరీష, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రెడ్డి



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చేవెళ్ల మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో సోమవారం పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పలు దుకాణాల్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లను పరిశీలించి.. నిషేధిత కవర్లను స్వాధీనం చేసుకొని 12 వేల రూపాయల వరకు జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలను వివరించి.. ఇకపై ఎవరైనా ప్లాస్టిక్ వాడితే పెద్ద మొత్తంలో జరిమాన విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి.. పట్టణాన్ని కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు విజయేంద్ర మోహన్, ప్రశాంత్, రాఘవేందర్, సుధాకర్ ఉన్నారు.



షాద్‌నగర్: పట్టణంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు



షాద్‌నగర్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, నాయకులు



కేశంపేట: నివాళులర్పించి మాట్లాడుతున్న మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

పోరాటయోధుడు సర్వాయి పాపన్న

పీడిత జనులు, బహుజనుల ఆత్మగౌరవం కోసం తన సర్వస్వాన్ని ధారబోసిన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని పలువురు కొనియాడారు. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో సోమవారం పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని వివిధ పార్టీల నాయకులు, గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డ మహనీయుడు పాపన్నగౌడ్ అని, నేటి యువత ఆయన ఆశయ సాధనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



చేవెళ్ల: గౌడ సంఘం ఆధ్వర్యంలో..



మొయినాబాద్‌రూరల్: బాకారంలో..



శంకర్‌పల్లి: పట్టణ చౌరస్తాలో..



షాద్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



షాబాద్: మండల కేంద్రంలో..



నందిగామ: మండల కేంద్రంలో..



కొందుర్గు: మండల కేంద్రంలో..